సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 19 । జూలై । 2025



'మున్సిపల్'లో ఏసీబీ సోదాలు

పాల్వంచ మున్సిపల్ డివిజన్ కార్యాలయంలో మరోసారి ఏసీబీ తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది. 8లో



పంటల బీమాపై పట్టింపేది?

గత ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అటకెక్కించగా. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదేదారిలో పయనిస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

డీఏఓ ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఏఓ బాబూరావు

జూలూరుపాడు: సహకార సంఘం కార్యాలయంలోని ఎరువుల విక్రయ కేంద్రంలో శుక్రవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి వేల్పుల బాబూరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. నానో యూరియా, నానో డీఏపీ వాడటం వల్ల కలిగే లాభాలను వివరించారు. జిల్లాలో యూరియా కొరతలేదని, అవసరమైన మేరకే యూరియాను తీసుకోవాలని రైతులకు సూచించారు. ఏఓ దీపక్ ఆనంద్, ఏఈఓ గౌస్, సొసైటీ సెక్రటరీ రమణారెడ్డి, సిబ్బంది సాయి, అమల, సునీత, రైతులు పాల్గొన్నారు.

399 అడుగులకు చేరిన కిన్నెరసాని

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద వచ్చి చేరుతుంటంతో కిన్నెరసాని జలాశయం నీటిమట్టం పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువనుంచి 4 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో శుక్రవారం నీటిమట్టం 399 అడుగులకు చేరిందని ప్రాజెక్ట్ పర్యవేక్షణ ఇంజనీర్ తెలిపారు.

దేవాదాయ శాఖ భూముల పరిశీలన

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను శుక్రవారం ఆ శాఖ వరంగల్ జోన్ శాఖ ఉప కమిషనర్ కేఎల్ సంధ్యారాణి పరిశీలించారు. తొలుత శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆ తర్వాత కోర్టు వివాదంలో ఉన్న చిట్టి సత్రం, కామేశ్వరమ్మ సత్రంతో పాటు నిర్మాణంలో ఉన్న ఆర్యవైశ్య సత్రం భూములను, కొత్తగూడెం ఓల్డ్ డిపో సమీపంలోని సత్రం భూములను పరిశీలించారు. ఈఓ రజనీకుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మణుగూరు ఓసీ విస్తరణకు ఆమోదం



మాట్లాడుతున్న భూ సేకరణ ప్రత్యేకాధికారి సుమ

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఓసీ విస్తరణకు రామానుజవరం గ్రామస్తులు సముఖత వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో భూ సేకరణ ప్రత్యేకాధికారి సుమ మాట్లాడుతూ భూ నిర్వాసితులైన గిరిజనులకు, గిరిజనేతరులకు లభించే పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలతోపాటు ఔట్ సోర్సింగ్ ఉపాధి, టెక్నికల్ కోచింగ్ తదితర అంశాలపై వివరించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రైతులవిజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని మెరుగైన పరిహారం అందిస్తామని తెలిపారు. దీంతో గ్రామస్తులు సుముఖత వ్యక్తం చేస్తూ సంతకాలు చేశారు. ఓసీ విస్తరణకు సింగరేణి ఆధీనంలోని భూమి మినహా 813 ఎకరాలు అవసరం ఉండగా, ఇప్పటికే కొమ్ముగూడెం, తిర్లాపురం గ్రామాల్లో ప్రజామోదం లభించింది. తాజాగా రామానుజవరంలోనూ ఆమోదం లభించడంతో మణుగూరు ఓసీ విస్తరణకు మార్గం సుగమమైంది. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు వృథా!



రుణమాఫీ లబ్ధిదారుల వివరాలతో ముద్రించిన ఫ్లెక్సీ

- గ్రామాల్లో రుణమాఫీ వివరాలతో ఫ్లెక్సీల ఏర్పాటుకు నిర్ణయం
- మాఫీకాని వారినుంచి వ్యతిరేకత రావడంతో నిలిచిన ప్రక్రియ
- జిల్లాలో రూ.18.33 లక్షల ప్రజాధనం దుబారా!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతులకు రుణమాఫీ చేశామని ప్రచారం చేసుకునేందుకు రాష్ట్ర సర్కారు చేసిన ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. సరైన ప్రణాళిక లేకుండా కేవలం ప్రచారమే లక్ష్యంగా చేసిన ప్రయత్నం విఫలమైంది. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది. శాసనసభ సాధారణ ఎన్నికల ముందు రైతులకు రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. గెలుపొందిన తర్వాత రుణమాఫీ ఎప్పుడు చేస్తారనే ప్రశ్నలు రైతులు, ప్రతిపక్షాల నుంచి ఎదురయ్యాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెబుతూనే 2024 ఆగస్టు 15 నుంచి విడతల వారీగా రుణమాఫీ చేశారు. ఎట్టకేలకు 2024–2025 ఆర్థిక సంవత్సరం ముగింపు / ఉగాది పండగ నాటికి బ్యాంకుల్లో రుణ మాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

నియోజకవర్గం	రుణమాఫీ లబ్ధిదారులు	ప్రింట్‌చేసిన ఫ్లెక్సీలు
అశ్వారావుపేట	16,600	1,419
భద్రాచలం	7,993	681
కొత్తగూడెం	10,814	921
పినపాక	16,430	1,401
ఇల్లెందు	9,572	351
మొత్తం	61,409	5,239

61 వేల ఫ్లెక్సీల ముద్రణ

రుణమాఫీ అమలులో అనేక కొర్రీలతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారంటూ ప్రతిపక్షాలు విమర్శించాయి. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వేల కోట్ల రూపాయలు రుణమాఫీ కోసం వెచ్చించామని ప్రభుత్వం చెప్పుకుంది. ఈ క్రమంలోనే ఏ గ్రామంలో ఎంత మంది రైతులకు రుణమాఫీ జరిగింది. ఎంత డబ్బులు వారి ఖాతాలో జమ చేశామనే వివరాలను బహిరంగంగా వెల్లడించేందుకు సిద్ధమైంది. లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీలు ముద్రించి గ్రామాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రామానికి రెండు, మూడు చొప్పున జిల్లాలోనే అరవై ఒక్క వేలకు పైగా ఫ్లెక్సీలను ముద్రించింది.

గప్‌చుప్

రుణమాఫీ లబ్ధిదారుల వివరాలను పేర్కొంటూ మే చివరి వారం నుంచి గ్రామాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన చోట ఇబ్బందులు రావడం మొదలైంది. సాంకేతిక కారణాలు, వడ్డీ కారణంగా రూ.రెండు లక్షలకు మించిన రుణం ఉన్న రైతుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతి రేకత వచ్చింది. పంచాయతీ ఎన్నికలకు ముందు బ్రహ్మాస్త్రంలా పనికి వస్తుంది అనుకున్న ప్రచా రం కాస్త బూమరాంగ్ అవుతుందనే సందేహాలు ప్రభు త్వ పెద్దల్లో నెలకొన్నాయి. దీంతో ఫ్లెక్సీల ఏర్పాటును ఎక్కడిక్కడ నిలిపేశారు. అప్పటికే 220 గ్రామాల్లో ఏర్పాటు చేసినట్టు అధికార వర్గాలు చెబుతున్నా వాటిలో కూడా సింహభాగం ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో ప్రింటింగ్ పూర్తి చేసుకున్న ఫ్లెక్సీలు మండల కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో మూలన పడేశారు. ఒక్కో ఫ్లెక్సీకి సగటున రూ.350 వంతున ఖర్చు చేశారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.28 కోట్లు ఖర్చు చేసినట్టు సమాచారం. జిల్లాలో రూ.18.33 లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

మహిళల సమగ్రాభివృద్ధే లక్ష్యం



భద్రాచలం: మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎమ్మెల్యేలు పాయం, తెల్లం, కలెక్టర్ జితేష్, పీఓ రాహుల్

- పినపాకలో 40 వేల ఎకరాలకు సీతారామ జలాలు
- రామాలయ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి
- ఇందిర మహిళా శక్తి సంబరాల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాచలం/కొత్తగూడెంఅర్బన్/బూర్గంపాడు: మహిళల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బూర్గంపాడు మార్కెట్ యార్డులో, భద్రాచలం గిరిజన భవన్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులతో కలిసి పాల్గొన్నారు. పినపాక నియోజకవర్గానికి చెందిన మహిళలకు రూ 19.18 కోట్ల పావలా వడ్డీ రుణాల చెక్కులను అందజేశారు. భద్రాచలంలో 268 స్వయం సహాయక సంఘాలకు రూ.17.64కోట్లు, లోన్ బీమా ద్వారా 17మంది సభ్యులకు రూ.22.49 లక్షల చెక్కులను లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం రామాలయం చుట్టు పక్కల జరుగుతున్న మాడ వీధుల విస్తరణ పనులను పరిశీలించారు. సేకరించిన స్థలం వివరాలను రెవెన్యూ అధికారులను, దేవస్థానం ఈవోలను అడిగి తెలుసుకున్నారు. తొలుత గిరిజన్ భవన్‌లో మహిళలు తయారు చేసిన బిస్కెట్లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు గత ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులు పెట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ. 875 కోట్లను చెల్లించామని తెలిపారు. సభ్యుల వయో పరిమితిని 60 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వరకు పెంచనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ ఆశయ స్ఫూర్తితో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయ స్ఫూర్తితో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలని పట్టుదలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్ట్‌తో 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థలం గుర్తించాలని కలెక్టర్‌కు సూచించారు. గోదావరి ముంపు బాధితులకు మెరక ప్రాంతంలో స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలకు అదనంగా 1500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి తగిన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్, ఐటీడీఏ పీవో, దేవస్థానం అధికారులు, వైదిక కమిటీ సభ్యులను మంత్రి ఆదేశించారు. భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు కూడా మాట్లాడారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించుకుని హస్తం పార్టీ సత్తా చాటుదామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి పిలుపునిచ్చా రు. శుక్రవారం కొత్తగూడెంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న పొంగులేటి క్యాంపు కార్యాలయంలో చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాల్లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని నియమించినట్లు మంత్రి ప్రకటించగా కొత్తగూడెం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, సీతఈఓ నాగలక్ష్మీ, డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎస్‌ఓ రుక్మిణి, నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, తుళ్లూరి బ్రహ్మయ్య, ఆళ్ల మురళి, తూము చౌదరి, పెద్దబాబు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కంచర్ల చంద్రశేఖర్, ఎండీ.రజాక్, కార్తీక్, సీపీఐ నాయకుడు బొల్లోజు అయోధ్య పాల్గొన్నారు.

సల్లంగా చూడు తల్లీ..



అమ్మవారికి సమర్పించిన 128 రకాల ప్రసాదాలు

అశ్వారావుపేటలోని గుర్రాల చెరువు గ్రామ శివారులో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి శ్రీ సాయిబాబా ఆలయం, సాయిసేవా సమితి ఆధ్వర్యంలో సారె, చీర, పసుపు, కుంకుమలతోపాటు 128 రకాల ప్రసాదాలు, 18రకాల పండ్లు సమర్పించారు. అమ్మవారిని గాజులతో అలంకరించి పంచామృతంతో అభిషేకం జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

–అశ్వారావుపేటరూరల్



అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించా రు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకు మ, గాజులు, హారతి సమర్పించారు. అనంత రం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. కుంకుమ పూజ, గణపతి హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఆధార్ క్యాంప్‌లకు విశేష స్పందన

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో నిర్వహించిన మెగా ఆధార్ క్యాంపులకు విశేష స్పందన లభించిందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన క్యాంపుల్లో 6,159 మంది ఆధార్ నమోదు, సవరణలు వంటి సేవలను పొందారని తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన క్యాంప్‌లో అత్యధికంగా 3,772 మంది, భద్రాచలం క్యాంప్‌లో 801 మంది, ఇల్లెందులో 714 మంది, మణుగూరులో 525 మంది, దమ్మపేటలో 347మంది సేవలు పొందారని వివరించారు. ఈ–సేవలు, పంచాయతీ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసులలో, స్కూల్ ఆధార్ టీంల ద్వారా సేవలు లభిస్తాయని వివరించారు. స్కూల్ ఆధార్ టీంకు సంబంధించి వివరాల కోసం జిల్లా మేనేజరు వంశీని 73311 15024 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆధార్ సేవలపై ఫిర్యాదులు, సలహాల కోసం యూఐడీఏఐ హెల్ప్‌లైన్ నంబర్ 1947 లేదా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజరు సైదేశ్వర రావును కలెక్టరేట్‌లో సంప్రదించాలని సూచించారు.

రేగాను పరామర్శించిన కేటీఆర్

పాల్గొన్న పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

కరకగూడెం: మాతృ వియోగంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును మండలంలోని కుర్నవల్లి గ్రామంలో ఉన్న ఆయన స్వగృహంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం పరామర్శించారు. రేగా మాతృమూర్తి నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, సత్యవతి రాథోడ్, వనమా, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, కందాళ ఉపేందర్ రెడ్డి, శంకర్ నాయక్, నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, బడే నాగజ్యోతి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు రేగాను పరామర్శించారు. భట్టుపల్లి మినీ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కేటీఆర్ వాహనంలో రాగా, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.



నర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, సత్యవతి, అజయ్‌కుమార్

రప్పా.. రప్పా !

పెద్దసంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు పుష్ప–2 సినిమాలోని 'రప్పా.. రప్పా' డైలాగ్‌తో కూడిన బోర్డులు ప్రదర్శించారు. అందులో కేటీఆర్ ఫొటోతో పాటు '2028లో కాంగ్రెస్ నాయకులకు మిత్తీతో సహా చెలిస్తాం.. 3.0 లోడింగ్..' అంటూ అందులో ముద్రించారు.

స్త్రీనిధి.. వసూళ్ల జాడేది ?

- జిల్లాలో రూ.52.78 కోట్ల మేర బకాయిలు
- అధికారుల నిర్లక్ష్యంతోనే భారీగా పెండింగ్ !
- ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు సన్నాహాలు



మొండి బకాయిలపై వీఓఏలతో సమావేశమైన అధికారులు(ఫైల్)

చుంచుపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం బ్యాంక్ లింకేజీతోపాటు స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తోంది. ప్రతీనెల సకాలంలో చెల్లించే మహిళా సంఘాలకు కొత్తరుణాలు ఇస్తోంది. అయితే ఇటీవల ఎస్‌హెచ్‌జీల నుంచి రుణాల రికవరీలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం స్త్రీనిధి రుణ బకాయిలు భారీగా పేరుకుపోగా, వసూళ్లపై నీలినీడలు కమ్ముకున్నాయి. వ్యక్తిగత అవసరాలతోపాటు చిరు వ్యాపారాల కోసం స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో వాయిదాలు చెల్లించడం లేదు. గత నాలుగేళ్లుగా అధికారుల నిర్లక్ష్యంతోనే బకాయిల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. జిల్లాలో స్త్రీనిధి బకాయిలు భారీగా పేరుకుపోవడం అధికారులకు సవాల్‌గా మారింది. వీటిని రాబట్టేందుకు సెర్ప్ అధికారులు నెలరోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

పేరుకుపోతున్న బకాయిలు

రాష్ట్ర ప్రభుత్వం అందించే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా రాణిస్తున్నారు. జిల్లాలోని 23 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 18,415 స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఇందులో 1,81,612 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. వారు చిరు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళా శక్తి పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది భారీగా రుణాలు ఇస్తోంది. అయితే తిరిగి సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ముఖ్యంగా మెప్మా, సెర్ప్ పరిధిలో మహిళా సంఘాల సభ్యులు చెల్లించాల్సిన స్త్రీనిధి రుణ బకాయిలు రూ.64.41 కోట్లు ఉండగా, రూ.11.81కోట్లు మాత్రమే వచ్చాయి. ఇంకా రూ.52.78కోట్ల మేర బకాయిలు వసూలు కావాల్సి ఉంది.


అధికారులు అవగాహన కల్పిస్తే..

స్వయం సహాయక సంఘాలు నెలకు రెండుసార్లు సమావేశమై అప్పులు, పొదుపు విషయం చర్చించాలి. కానీ ఈ సమావేశాలు నామమాత్రంగానే చేపడుతున్నారని తెలుస్తోంది. వీఓఏలు చెల్లించిన రుణాలు, కిస్తీలను స్త్రీనిధి అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. తగినంత మంది అధికారులు, సిబ్బంది లేకపోవడంతో పనిభారంతో పర్యవేక్షణ లోపిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. మహిళా సంఘాల సభ్యులు రుణ వాయిదాలు సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం నుంచి రాయితీలు పొందే అవకాశం ఉంటుంది. ఈ విషయమై ఆయా అధికారులు సభ్యులకు అవగాహన కల్పించాలని పలువురు అంటున్నారు.

పేరుకుపోయిన బకాయిలు(రూ.కోట్లలో)

మండలం	బకాయి	మండలం	బకాయి
అన్నపురెడ్డిపల్లి	1.18	లక్ష్మీదేవిపల్లి	2.64
అశ్వాపురం	2.26	మణుగూరు	3.24
అశ్వారావుపేట	2.16	ములకలపల్లి	3.31
బూర్గంపాడు	3.09	పాల్వంచ	1.56
చండ్రుగొండ	1.81	పినపాక	1.76
చర్ల	1.76	సుజాతనగర్	1.68
చుంచుపల్లి	3.28	టేకులపల్లి	3.16
దమ్మపేట	4.53	ఇల్లెందు	2.55
జూలూరుపాడు	2.75	మెప్మా పరిధిలో..	
కరకగూడెం	1.10	స్త్రీశక్తి గ్రూపు	1.74
		క్రాంతి గ్రూపు	1.67

ప్రణాళిక రూపొందిస్తున్నాం



డీఆర్డీఓ ఆదేశాల మేరకు జిల్లాలో స్త్రీనిధి బకాయిలు రాబట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా మొండి బకాయిలపై దృష్టిసారిస్తాం. నెలరోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని యోచిస్తున్నాం. గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పర్యటించి మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తాం. పాత బకాయిలను రాబట్టేలా చర్యలు తీసుకుంటాం.

– డి.నీలయ్య, అదనపు డీఆర్‌డీఓ, సెర్ప్

క్లుప్తంగా

ప్రచార కరపత్రాల దహనం



కరపత్రాలను దహనం చేస్తున్న కార్యకర్తలు

ఇల్లెందురూరల్: మండలంలోని 21 పిట్ ఏరియా భూపేశ్‌నగర్‌లో కరపత్రాలు, ఓ మతగ్రంథంతో ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. వారి చేతిలో ఉన్న ప్రతులు, కరపత్రాలను లాక్కొని దహనం చేశారు. ఘటనపై దినకర్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి.. ఘటనకు సంబంధించిన వీడియో ఆధారంగా ప్రతులను దహనం చేసిన పది మందిపై కేసు నమోదు చేశారు.

పురుగుమందుల షాప్‌లో రికార్డులు స్వాధీనం



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ నవీన్

దుమ్ముగూడెం: మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామానికి చెందిన పురుగుమందుల వ్యాపారి దోసపాటివెంకటేశ్వరరావుకు చెందిన దుకాణ రికార్డులను వ్యవసాయాధికారి నవీన్ కుమార్ శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గురువారం సుజ్ఞానపురం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు ఒకే మందును వేర్వేరు ధరలకు విక్రయించి, బిల్లులు ఇవ్వలేదు. దీంతో రైతులు పోలీసులు, ఏఓకు ఫిర్యాదు చేశారు. ఏఓ శుక్రవారం ఎస్‌ఐ గణేశ్‌తో కలిసి దుకాణాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి బాధితులను విచారించారు. రైతులకు బిల్లులు ఇవ్వలేదని, ఇద్దరికీ వేర్వేరు ధరలకు విక్రయించినట్లు తేలడంతో రికార్డుల్లో స్టాప్ సేల్ అని రాశారు. అనంతరం దుకాణ లైసెన్స్ రద్దు చేసేందుకు జిల్లా అధికారులకు సిఫార్సు చేసినట్లు ఏఓ తెలిపారు.

కేటీఆర్ పర్యటనలో సీఐ!

ఖమ్మంక్రైం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటన కోసం హెలీకాప్టర్‌లో రాగా, హెలీప్యాడ్ వద్ద ఓ సీఐ కనిపించడం చర్చనీయాంశంగా మారింది. వివాదాస్పదుడిగా ముద్ర పడిన ఆ సీఐ భద్రాద్రి జిల్లా డీసీఆర్‌బీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సివిల్ డ్రెస్‌లో హెలీప్యాడ్ వద్ద వేచి ఉండడాన్ని గుర్తించారు. గతంలో ఖమ్మం రూరల్ సీఐగా విధులు నిర్వర్తించినప్పుడు ఆయన బీఆర్‌ఎస్ నాయకుల సూచనలతో ఇతర పార్టీల నేతలను వేధించాడనే విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ విషయమై సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు గతంలో ఘాటుగా స్పందించారు. ఇప్పుడు ఆయన కేటీఆర్ పర్యటనలో పాల్గొనడం పోలీసు వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఉన్నతాధికారుల అనుమతితో వచ్చాడా, లేదా అన్నది తెలియరాలేదు. అయితే, గతంలో సిరిసిల్లలో పనిచేసినప్పుడు కేటీఆర్‌తో ఉన్న సంబంధాల కారణంగానే వచ్చి ఉంటాడని మరికొందరు చెబుతున్నారు.

ట్రెయినీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల, సుదిమళ్ల గిరిజన గురుకుల బాలికల పాఠశాలలను ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, ఎస్‌డీసీ ప్రోగ్రాం అధికారి మధువరుణ్ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో వసతి గృహాలను, తరగతి గదులను, వంట, స్టోర్ రూంలను పరిశీలించారు. ప్రతీరోజు అందిస్తున్న మెనూ వివరాలతోపాటు భోజనం ఎలా ఉంటోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అందుకోసం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే సరైన ప్రణాళికతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి కవిత, హెచ్‌ఓ రాజు, హెచ్‌ఎం నాగమణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

21న ఖమ్మం మార్కెట్‌కు సెలవు

ఖమ్మంవ్యవసాయం: ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా సోమవారం(21న) ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. తిరిగి మంగళవారం యథాతథంగా పంటల కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

పంటల బీమాపై పట్టింపేది?



గత ఏడాది భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేలు

- ఎనిమిదేళ్లుగా నిలిచిన పంటల బీమా పథకం
- ఫసల్ బీమాను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతున్న రైతులు
- పరిహారం అందక ఆర్థికంగా చితికిపోతున్న రైతాంగం

బూర్గంపాడు: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అటకెక్కించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేదారిలో పయనిస్తోంది. అకాల వర్షాలు, వరదలు, కరువు పరిస్థితుల్లో పంటలు నష్టపోయిన రైతులకు బీమా అందే పరిస్థితులు లేవు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవటంతో రైతులకు నష్టం జరుగుతోంది. వ్యవసాయ సీజన్ ప్రారంభమై యాభైరోజులు దాటింది. ఇప్పటి వరకు పంటల బీమాపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో పంటలు వడబడుతున్నాయి. ఇలాంటి తరుణంలోరైతులు పంటల బీమా కోసం ఎదురుచూస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 5.50 లక్షల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. సుమారు 2.95 లక్షల మంది రైతులు పత్తి, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. ఉద్యానవన పంటల సాగు కూడా పెరిగింది. ముఖ్యంగా పామాయిల్ సాగు ఏటా విస్తరిస్తోంది. కానీ, అకాల వర్షాలు, వరదలు నష్టం కలిగిస్తున్నాయి. పంట నష్టం జరిగినప్పుడు బీమా లేక ఎలాంటి పరిహారం అందటం లేదు. భారీ వర్షాలు, వరదలకు పంటలు నష్టపోయినప్పుడు గత బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందలేదు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. కానీ, ఈ ప్రభుత్వం కూడా బీమాను పట్టించుకోవడం లేదు. కానీ, గత ఏడాది వానాకాలం సీజన్‌లో భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం మాత్రం అందించింది.

2018 వరకు..

2017 – 18 వరకు రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలైంది. రైతులు పంటరుణాలు తీసుకున్నప్పుడు బ్యాంకర్లు ఫసల్ బీమా కోసం రైతుల వాటాను బీమా కింద జమచేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపేవారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కూడా జతచేసి కేంద్రానికి పంపేది. కేంద్ర ప్రభుత్వం తమ వాటాను కూడా కలిపి బీమా కంపెనీలకు చెల్లించేది. కొన్నిపంటలకు గ్రామాన్ని యూనిట్‌గా , కొన్ని పంటలకు మండలాన్ని యూనిట్‌గా, మరికొన్నింటికి వ్యవసాయ డివిజన్‌ను యూనిట్‌గా తీసుకుని పంటల బీమా అమలు చేశారు. పంటలు నష్టపోయిన తరుణంలో ఫసల్ బీమాతో పెద్దగా మేలు జరగటం లేదనే భావనతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ పథకాన్ని ఎత్తివేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమాను సొంతంగా రాష్ట్రంలో అమలు చేయాలని యోచించింది. విధివిధానాలపై కసరత్తు చేసినట్లు తెలిసింది. అయితే కొత్త బీమా పథకాన్ని అమలు చేయాలా.. లేక ఫసల్ బీమాను మళ్లీ కొనసాగించాలా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.

ఫసల్ బీమా అమలు చేయాలి



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమాను రాష్ట్రంలో కూడా అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం రైతుల మేలుకోరి తీసుకువచ్చిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకోవటం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

–ఏనుగుల వెంకటరెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి

తీవ్రంగా నష్టపోతున్నాం..



భారీ వర్షాలు, వరదలకు గత ఏడాది పత్తి చేలు, వరి మాగాణులు బాగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పంటల బీమా అమలు చేస్తే రైతులకు ఉపయోగం. గత ఏడాది ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు పరిహారమందించింది. దీనికి తోడు బీమా ఉండి ఉంటే రైతులకు మరికొంత లాభం జరిగేది.

–ఇమడాబత్తుని రామకృష్ణ, రైతు

మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు



మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత గదిలో విచారణ చేస్తున్న ఏసీబీ డీఎస్పీ రమేశ్, అధికారులు

కార్యాలయ నిర్వహణపై వచ్చిన ఫిర్యాదులతో ఆకస్మిక తనిఖీ

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ డివిజన్ కార్యాలయంలో మరో సారి ఏసీబీ తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది. శుక్రవారం ఏసీబీ డీఎస్పీ ఐ.రమేశ్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా కార్యాలయానికి చేరుకున్న అధికారులు గేట్లు, తలుపులు మూసి సిబ్బందిని బయటకు వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. మొదటగా మేనేజర్ ఎల్‌వీ సత్యనారాయణతో మాట్లాడారు. అనంతరం సమాచారం అందుకున్న కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత కార్యాలయానికి రాగా ఆమెతో పాటు ఇతర సిబ్బందిపై విచారణ చేపట్టారు. కాగా కార్యాలయంలో ఇటీవల జరిగిన పలు అభివృద్ధి పనులు, ఆరోపణలపై ఫిర్యాదులు వచ్చాయని ఈ క్రమంలో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కాగా కార్యాలయ సిబ్బంది వద్ద అనధికారికంగా ఉన్న రూ.40 వేల నగదును సైతం సీజ్ చేశారు.

ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగుతున్న విచారణ

ఉదయం 11.30 గంటల సమయంలో ఆకస్మికంగా కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు కార్యాలయంలో పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కమిషనర్ గదిలోకి సంబంధిత రికార్డులు తెప్పించుకుని వాటిని పరిశీలించారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనుల్లో అనేక అవకతవకలు జరిగాయని, బినామీల పేరుతో అధికారులే పనులు చేపట్టారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అడ్డగోలుగా బిల్లులు చేసి నగదును పక్కదోవ పట్టించినట్లు పలు ఫిర్యాదులు వెల్లువెత్తిన క్రమంలో ఏసీబీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన పనుల వివరాలు, ఏవిధంగా పనులు కట్టబెట్టారు? ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే కోణాల్లో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, కొందరు ప్రైవేట్ ఉద్యోగులను అడ్డుపెట్టుకుని అధికారులు అక్రమార్జన చేశారని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలోనే ఏసీబీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాగా, కొందరు ప్రైవేట్ ఉద్యోగులు, డ్రైవర్లు, అటెండర్లు, ఇతర సిబ్బంది ఉద్యోగుల ఫోన్ పే, గూగుల్ పే, ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలను సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. కొందరి ఫోన్లలో భారీ ఎత్తున నగదు బదిలీలు జరిగినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలు ఎందుకు జరిగాయనే కోణంలో ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఈ ఏడాదిలో రెండోసారి..

ఈ ఏడాది ఏప్రిల్ 18న మున్సిపాలిటీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ వెంకటరమణి, ప్రైవేట్ ఉద్యోగి ప్రసన్నకుమార్‌ను పట్టుకున్నారు. ఈ క్రమంలో మరో సారి ఏసీబీ తనిఖీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

ఆరోపణల నేపథ్యంలో విచారణ

కార్యాలయంలో ఇటీవల జరిగిన అనేక పనుల విషయంలో జరిగిన అవకతవకలు, ప్రైవేట్ వ్యక్తులతో చేస్తున్న అక్రమార్జన వంటి విషయాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టాం. ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరిగినా, డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలి. లేదా 91543 88981 నంబర్‌లో సంప్రదించాలి. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

–ఐ.రమేశ్, ఏసీబీ డీఎస్పీ

ప్రజలు ఓటేస్తే.. కాంగ్రెస్ కాటేసింది

అలవి కాని హామీలతో గెలిచిన కాంగ్రెస్

- ఉమ్మడి జిల్లా రాజకీయ సమీకరణలతో గత ఎన్నికల్లో నష్టపోయాం..
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు కథానాయకులై కదలాలి
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మాట్లాడుతున్న మాజీమంత్రి కేటీఆర్, పక్కన మంత్రులు పువ్వాడ, సత్యవతి, ఎంపీ రవిచంద్ర తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల్లో అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఓటేస్తే.. వాటిని అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం కాటేసిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ బ్రహ్మాండంగా భోజనం పెడుతున్నా ఈయనెవరో బిర్యానీ పెడతానంటున్నడుగా అని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ ప్రజలకు ఇప్పుడు అసలు విషయం అర్థమైనందున, ఇప్పుడు ఎన్నికలు వస్తే ఏం జరుగుతుందో రేవంత్ రెడ్డికి తెలుసునన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి.. వాటిని బొంద పెడతారని ప్రజలు ఊహించక ఒక్క తప్పు ఓటు వేసినందుకు ఐదేళ్లు శిక్ష పడిందని పేర్కొన్నారు.

రెండుసార్లు అవకాశం ఇచ్చారు..

తెలంగాణ ప్రజలు రెండు సార్లు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వాన కొత్త రాష్ట్రంలో బుడిబుడి అడుగులు వేస్తూనే.. మరోవైపు పటిష్టమైన పునాది వేసేలా నిర్మాణాత్మకంగా, ప్రణాళికాయుతంగా పదేళ్లు పనిచేశామని తెలిపారు. తద్వారా వ్యవసాయం, సాగునీరు, పట్టణ, పల్లె అభివృద్ధి, విద్య, వైద్యం, గిరిజన, దళితుల, బలహీన వర్గాలు, మహిళలు, మైనార్టీల సంక్షేమం తదితర రంగాల్లో దేశంలోనే ఆదర్శంగా నిలిపామన్నారు. తద్వారా 2014లో కేవలం 63 సీట్లు సాధించిన బీఆర్‌ఎస్‌కు 2018లో ప్రజలు 88 సీట్లు కట్టబెట్టారని తెలిపారు.

హామీలు ఊదరగొట్టి..

పదేళ్లపాటు బీఆర్‌ఎస్ అద్భుత పాలన అందించాక 2023లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ప్రజలను ఆకర్షించాయని కేటీఆర్ చెప్పారు. నోటికి వచ్చినట్లుగా హామీల వర్షం కురిపించి రైతు డిక్లరేషన్, బోనస్ పేరిట బోగస్ మాటలు చెప్పారన్నారు. బీసీ డిక్లరేషన్, రైతుభరోసా, రుణమాఫీ, ఉద్యోగాల కల్పన, యువతకు పెళ్లికి తులం బంగారం తదితర ఈస్ట్‌మన్ కలర్ సినిమాతో నమ్మిన ప్రజలు మోసపోయారని చెప్పారు.

ప్రతినాయకుడు ఉంటేనే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ సమీకరణాల్లో భాగంగా 2023లో నష్టం జరిగిందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అన్నీ సవ్యంగా సాగితే జీవితం విలువ అర్థం కాదని, చుట్టూ ఉండే మనుషుల విలువ, నాయకుడి విలువ తెలియాలన్నా ప్రతినాయకుడు ఉండాల్సిందేనని చెప్పారు. జిల్లాలో ముగ్గురు మంత్రుల్లో ఒకాయన చెప్పిన బాంబులు ఇప్పటికీ పేలలేదన్నారు. ఇంకొకరు కమీషన్లలో బిజీగా ఉంటే, మరొకరు వ్యవసాయ మంత్రిగా ఏం చేస్తున్నాడో తెలియడం లేదని చెప్పారు. రైతులు ఎరువుల దుకాణాల ముందు లైన్లలో చెప్పులు పెడుతుండడం ప్రభుత్వ పాలనకు అద్దం పడుతోందని తెలిపారు.

మీ కోసం మేం కష్టపడతాం..

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నాయకుల కోసం కార్యకర్తలు కష్టపడ్డారని, ఇప్పుడు కార్యకర్తల కోసం నాయకులు కష్టపడతారని కేటీఆర్ వెల్లడించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నందున కష్టపడి పనిచేస్తే ఖమ్మం, భద్రాద్రి జెడ్పీలు, ఎంపీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్ స్థానాలన్నీ గెలవొచ్చని తెలిపారు. మున్సిపాలిటీలు, ఎంపీపీ స్థానాల్లోనూ యువకులు ముందుకొచ్చి కాంగ్రెస్‌ను చీల్చి చెండాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసాన్ని గ్రామగ్రామాన ఎండగట్టేలా మరో కేసీఆర్‌లా కథానాయకులై కదలాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, జెడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, ఖమర్, తాజుద్దీన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మతతత్వం దేశానికి ప్రమాదం

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్



మాట్లాడుతున్న మాస్‌లైన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాగూర్, పక్కన పోటు, గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: దేశంలో రోజురోజుకూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల మతతత్వం పెరిగిపోతోందని, ఇది దేశానికి ప్రమాదమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ అన్నారు. ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి(ఎల్లన్న) మెమోరియల్ ట్రస్ట్ భవన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. దేశంలో యూనివర్సిటీలకు, మీడియాకు స్వతంత్రం లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామ్య విలువలపై, రాజ్యాంగంపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మతతత్వ విధానాలపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని విమర్శించారు. బ్రోకర్లు దర్జాగా డబ్బులు తీసుకుని 24 గంటల్లో రేషన్ కార్డులు ఇస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఇల్లెందుకు సీతారామ జలాలు ఇవ్వకుండా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించిన రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్‌ను కొనసాగించాలని కోరారు. ఆంక్షలు లేకుండా ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కిచ్చెల రంగయ్య, కేజీ రాంచందర్, చంద్ర అరుణ, కే.రమ, జి.వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, నంది రామయ్య, సదానందం, జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, పాయం చిన్న చంద్రన్న, డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలపై నేటికీ వివక్షత కొనసాగుతున్నందున సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి సూచించారు. అన్నారు. ఐద్వా జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ఖమమంలోని సుందరయ్య భవనంలో నిర్వహించగా ఆమె మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింస పెరుగుతోందని, సనాతన ఆచారాల పేరుతో వంటింటికే పరిమితం చేస్తున్నారని తెలిపారు. అలాగే, మోదీ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానన్న హామీ నెరవేరక మహిళలు పౌష్టికాహారానికి దూరమవుతున్నారని చెప్పారు. ఈమేరకు బీజేపీ విధానాలను మహిళలు వ్యతిరేకించాలని సూచించారు. ఇక రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్న సీఎం, మంత్రులు ఎవరికీ ఉపాధి కల్పించకుండా హామీని ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, నాగసులోచన పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన గృహోపకరణాలు

మణుగూరురూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని సాంబాయిగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ ఖుర్బాన్ నిద్రిస్తున్న సమ యంలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, వస్తువులన్నీకాలిపోయాయి. ఖుర్బాన్‌కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. సమాచారంఅందుకున్న మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేశ్ దగ్ధమైన ఇంటిని పరిశీలించారు. డీటీరామారావు, ఆర్ఐ గోపి ఉన్నారు.

నలుగురిపై కేసు నమోదు

దుమ్ముగూడెం: అక్రమంగా పాపను దత్తత తీసుకున్న విషయంలో ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గణేశ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని చిన్న ఆర్లగూడెం గ్రామానికి చెందిన కోర్స రమేశ్ – ఆదిలక్ష్మి దంపతులు అశ్వాపురం మండలం కుర్నపల్లి గ్రామానికి చెందిన మెస్సా నరసింహారావు – అమల దంపతుల కుమార్తెను రెండు నెలల కిందట అక్రమంగా దత్తత తీసుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు పాపను తల్లిదండ్రులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరచారు. వారు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పాపను ఎవరికీ ఇవ్వమని, తామే పెంచుకుంటామని కమిటీ వారికి తల్లిదండ్రులు తెలపగా పాపను అప్పగించారు. కానీ, నెల రోజుల నుంచి పాపను కోర్స రమేశ్ – ఆదిలక్ష్మి దంపతులు పెంచుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు పాపను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆర్లగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ పాయం రాజేశ్వరి ఫిర్యాదు మేరకు అక్రమ దత్తతకు పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఆరు నెలల ఆ పాపను భద్రాచలంలోని శిశుగృహకు తరలించారు.

చికిత్స పొందుతున్న లారీడ్రైవర్ మృతి

పాల్వంచరూరల్: లారీ కిందకు వెళ్లి మరమ్మతులు చేస్తున్న డ్రైవర్ పైనుంచి అదే లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని సత్యసాయి జిల్లా సూరపల్లి గ్రామానికి చెందిన గార్ల సుందర్‌రాజు (35) సారపాక ఐటీసీ నుంచి పేపర్‌లోడుతో బెంగళూరుకు వెళ్తున్నాడు. గురువారం రాత్రి పాల్వంచ మండలం ఆర్‌టీఏ చెక్‌పోస్టు సమీపంలో నాగారంకాలనీవద్ద చాకలి శివశంకర్ లారీ చెడి పోయింది. సుందర్‌రాజు లారీని ఆపి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అదే సమయంలో చాకలి శివశంకర్, క్లీనర్ ఇస్మాయిల్ కలిసి సుందర్‌రాజును సాయం కోరడంతో లారీ కిందకు వెళ్లి మరమ్మతులు చేస్తున్నాడు. లారీ హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో ప్రమాదవశాత్తు లారీ ముందుకు కదిలి, మరమ్మతులు చేస్తున్న సుందర్‌రాజు పైనుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని సోదరుడు సురేశ్‌బాబు ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్, క్లీనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మధిర: మధిర రైల్వేస్టేషన్ సమీపాన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి (55) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమార్గంలో వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి సదరు వ్యక్తి బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించామని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అయితే, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకుల సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని విద్యానగర్‌కు చెందిన మునగాల నాగరాజు(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ పక్కన చెట్ల పొదల్లో ఆయన మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. నాగరాజుకు భార్య ఉండగా, ఇటీవల అత్తగారింటికి వెళ్లిన ఆయన మృతదేహమై కనిపించాడు. మృతదేహం కొంత మేర కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో మధిర రూరల్ సీఐ మధు, ఎస్‌ఐ ఆర్.రమేష్ చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

మంటల్లో టాటా ఏస్ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న వాహనం

నేలకొండపల్లి: ఇంజన్ వేడెక్కడానికి తోడు షార్ట్ సర్క్యూట్ కారణంగా వాహనం కాలిపోయింది. హైదరాబాద్‌కు చెందిన టాటా ఎస్ డ్రైవర్ ఆజాద్ శుక్రవారం ఖమ్మం నుంచి కోదాడ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేందుకు నేలకొండపల్లి మీదుగా బయలుదేరారు. ఈక్రమంలో పైనంపల్లి టోల్‌గేట్ వద్ద ఇంజన్ వేడికి తోడు షార్టు సర్క్యూట్ జరగడంతో మంటలు మొదలయ్యాయి. దీంతో డ్రైవర్ వాహనాన్ని పక్కన నిలిపి దిగగానే టాటా ఏస్ పూర్తిగా కాలిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.